# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 8, ఫిబ్రవరి 2026




మండుతున్న ఎండలు..

## అల్లాడుతున్న కూలీలు

➡ ఉపాధి పనుల వద్ద కరువైన కనీస సౌకర్యాలు!

➡ క్షేత్రస్థాయికి వెళ్లని సిబ్బంది.. కుర్చీకే పరిమితమైన ఏపీఓ

జన్నారం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

వేసవి కాలం ఇప్పుడిప్పుడే తన ప్రతాపాన్ని చూపిస్తోంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి, కానీ ఉపాధి హామీ పనుల వద్ద కూలీల క్షేమ సమాచారాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని జన్నారం మండల సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షులు పేరం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీల కోసం ప్రతి పని ప్రదేశంలో మంచినీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో కూలీలు తాగడానికి గుక్కెడు మంచి నీరు కూడా ఇంటి నుంచే తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ఎండ మిగతా 2లో..

మోదీ సహకారంతోనే

## మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యం

❖ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

❖ ప్రాణహిత ప్రాజెక్టుకు సహకారం కోరిన హరీష్ బాబు

❖ ప్రాంత సమస్యలపై ఫడ్నవీస్‌కు వినతి



కాగజ్‌నగర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:

కాగజ్‌నగర్, మున్సిపాలిటీల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే సాధ్యమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్పీఎం క్రికెట్ గ్రౌండ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా పట్టణాభివృద్ధికి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, యుఐడిఎఫ్, 15వ ఆర్థిక సంఘం, అమృత్ పథకాల ద్వారా డ్రైనేజ్, పారిశుద్ధం, తాగునీరు, రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల అభివృద్ధిపై తగిన దృష్టి సారించలేదని విమర్శించారు.ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని, బెల్లంపల్లి-గడ్చిరోలి జాతీయ రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీష్ బాబు, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నాగేష్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన సందర్భంగా ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి అయితే ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిస్తాయని, రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వాణిజ్య, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని నేతలు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రాణహిత ప్రాజెక్టు మిగతా 2లో..





బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో

## ఫుడ్ పాయిజన్

### 30 మందికి పైగా అస్వస్థత

బెల్లంపల్లి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య పాలనకు మరో నిదర్శనంగా బెల్లంపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న బెల్లంపల్లి బస్తీ ప్రభుత్వ బాలికల హాస్టల్లో నిన్న రాత్రి ఫుడ్పాయిజన్ ఘటన చోటుచేసుకుంది. కల్తీ ఆహారం తీసుకున్న సుమారు 30 మందికి పైగా బాలికలు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై వాంతులు, కడుపు నొప్పితో విలవిల్లాడారు. సమాచారం అందిన వెంటనే మాజీ మంత్రి హరీష్ రావు పర్యటనలో ఉన్న మాజీ శాసన సభ్యులు దుర్గం చిన్నయ్య హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బాధిత విద్యార్థినులను పరామర్శించారు. వైద్యులు, అధికారులను అప్రమత్తం చేసి బాలికలకు మెరుగైన చికిత్స అందించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలపై ఉన్న పట్టింపు పేద విద్యార్థుల జీవితాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. అధికారంలోకి మిగతా 2లో..



## 100 శాతం పోలింగ్‌కు ప్రతి ఓటరు భాగస్వామి కావాలి

✦ అట్టహాసంగా 120 ఆటోలతో భారీ ర్యాలీ ✦ స్వయంగా ఆటోలో ప్రయాణించి అవగాహన కల్పించిన కలెక్టర్



ఆదిలాబాద్, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:

జిల్లాలో 100 శాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ప్రతి ఓటరు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ఆటో ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా అధికారులతో కలిసి ఆటోలో ప్రయాణించి మిగతా 2లో..

# మండుతున్న ఎండలు.. అల్లాడుతున్న కూలీలు

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రతకు ఎవరైనా స్పృహతప్పి పడిపోతే కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహారిచడం, పనులను పర్యవేక్షించాల్సి న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది కేవలం హాజరు నమోదుకే పరిమితమవుతున్నారు. కూలీల ఇబ్బందులను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఎండ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాల్సి న సిబ్బంది, ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మండల స్థాయి అధికారి అయిన ఏపీఓ క్షేత్రస్థాయి పర్యటనలు చేసి పనుల నాణ్యతను, కూలీల సౌకర్యాలను సమీక్షించాల్సి ఉండగా, కేవలం తన కార్యాలయంలో కుర్చీకే పరిమితమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూలీలు ఎండలో మాడిపోతున్నా, కార్యాలయంలో కుర్చీలో కూర్చుని కాలక్షేపం చేస్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయడం లేదని జనం మండిపడుతున్నారని అన్నారు. ఎండలు మరింత ముదిరేలోపే ఉన్నతాధికారులు స్పందించి ప్రతి పని ప్రదేశంలో తక్షణమే మంచినీరు, టెంట్ ఏర్పాటు చేయాలి అని కోరారు. అందుబాటులో మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలని, నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై, క్షేత్రస్థాయికి రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన రెండేళ్లలోనే ప్రభుత్వ హాస్టల్స్ పరిస్థితి దారుణంగా మారింది. ఏదో ఒక ఘటన జరిగినా ప్రభుత్వం మోనంగా ఉండటం దారుణం అని మండిపడ్డారు. తక్షణమే ఈ ఘటనకు బాధ్యులైన వార్డెన్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికలకు పూర్తి స్థాయిలో మెరుగైన వైద్యం అందించడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పేద కుటుంబాలకు చెందిన బాలికల ప్రాణాలతో చెలగాటమాడే నిర్లక్ష్య పాలనను ఇక సహించబోమని దుర్గం చిన్నయ్య స్పష్టం చేశారు. ఈ ఘటన బెల్లంపల్లిలో తీవ్ర కలకలం రేపింది.

## 100 శాతం పోలింగ్‌కు ప్రతి ఓటరు భాగస్వామి కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఓటర్లలో చైతన్యం నింపారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి ప్రారంభమై వినాయక్ చౌక్, దేవిచంద్ చౌక్, అంబేద్కర్ చౌక్, నెహ్రూ చౌక్ మీదుగా జిల్లా గ్రంథాలయం వరకు సాగింది. అంతకుముందు ఆటోలకు స్వీప్ అవగాహన స్టిక్కర్లను కలెక్టర్ అతికించారు. అనంతరం గ్రంథాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తమ వెంట ఓటర్ స్లిప్పుతో పాటు ఎన్నికల సంఘం సూచించిన 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే బీఎల్ఓల ద్వారా ఇంటింటికీ పోల్ చిట్టీల పంపిణీ జరుగుతోందని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు, అవసరమైన చోట రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, జిల్లాలో 5 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు వేయాలని, ఎవరైనా ఒత్తిడి తెస్తే డయల్ 100 లేదా కలెక్టరేట్ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులు, ఆటో డ్రైవర్లు, యువత పాల్గొన్నారు.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు పొడగింపు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:

కుమురం భీం జిల్లాలోని మైనారిటీస్ విద్యార్థినీ విద్యార్థులకు, కళాశాల యాజమాన్యాలకు ఆ శాఖ జిల్లా సంక్షేమ అధికారి ఎంఎ అబ్దుల్ నదీమ్ ఖుద్దుసి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ మెట్రిక్ (ఫ్రెష్ రెన్యువల్) స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునే గడువును మార్చి 31, 2026 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. అర్హులైన మైనారిటీస్ విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కళాశాల యాజమాన్యాలు ఈపాస్ నమోదుపై ప్రత్యేక చొరవ చూపి, దరఖాస్తుల ప్రక్రియను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# మోదీ సహకారంతోనే మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా సాగునీటి వసతులు విస్తరించి రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి-గడ్చిరోలి రహదారి నిర్మాణం పూర్తైతే రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సులభమవుతాయని అభిప్రాయపడ్డారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఫడ్నవీస్ సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీలు ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ పట్టణ ప్రజలు మున్సిపాలిటీ ఎన్నికల్లో ఒకసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలా చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో గాని, 2 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో గాని పట్టణానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని, మౌలిక వసతుల కొరతతో పట్టణం మురికివాడలా మారిందని విమర్శించారుఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.60 కోట్ల నిధులు తెచ్చినట్లు, పలు రైళ్లకు హాల్టింగ్‌లు కల్పించామని, అండర్‌బ్రిడ్జి, ఓవర్‌బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు పట్టణ ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి చేస్తామని, గత పాలనల్లో పట్టణానికి ఆశించిన పురోగతి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, మాజీ జిల్లా అధ్యక్షులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, ప్రదీప్ రావు, మున్సిపల్ ఇంచార్జి భూమన్న, ఎస్టీ మూర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్, మాజీ జడ్పీటీసీ అరిగేలా నాగేశ్వర్ రావు, పీవీ రెడ్డి, సుహాసిని సిద్ధంశెట్టి, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ కుమార్, మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ కొండ్ర మనోహర్ గౌడ్, కో కన్వీనర్ కొప్పుల శంకర్, గజానన్ అశోక్, చిలువేరు ప్రవీణ్, అరుణ్ లోయ, ప్రశాంత్, గంగాధర్ అన్ని వార్డుల భాజపా కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రతా శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



నస్పూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

జిల్లాలో ఆహార భద్రత శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్యతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆహార భద్రత అధికారి వాసురామ్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఆహార సంబంధిత వ్యాపార, వాణిజ్య సంస్థల నుండి ఆహార భద్రత శాఖ అధికారులు ఆహార నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాలు పరీక్షించాలని తెలిపారు. ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించాలని, వివిధ యాజమాన్యాల కింద కొనసాగుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను పరీక్షించాలని, ఆహార సంబంధిత వ్యాపార, వాణిజ్య సంస్థలలో కలిగి ఉన్న ఆహారం కాల పరిమితి, నాణ్యత పరీక్షించాలని, సంబంధిత సంస్థలు కలిగి ఉన్న ధ్రువపత్రాలు పరిశీలించాలని, సరైన పత్రాలు లేని సంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులు శుభ్రత ప్రమాణాలు పాటించేలా అవగాహన కల్పించాలని, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టిక ఆహారం నమూనాలను సేకరించి పరీక్షించాలని తెలిపారు. ఆహార సంస్థలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ లను పరిశీలించి కాలపరిమితి ముగిసిన వాటి వివరాలతో సంబంధిత మున్సిపాలిటీ, జిల్లా పంచాయతీ శాఖ కార్యాలయానికి నివేదిక అందించాలని తెలిపారు. కాల పరిమితి ముగిసిన ఆహార పదార్థాలు లభించినట్లయితే పూర్తి వివరాలతో నివేదిక అందించాలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆహార పదార్థాల నాణ్యత సంబంధించిన ఫిర్యాదుల కొరకు 7981904028 నంబర్‌లో సంప్రదించవచ్చని, ఆన్‌లైన్‌లో https://foscos.fssai.gov.in వెబ్‌సైట్‌లో సంబంధిత వివరాలతో పాటు ఫోటో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఆహారం నాణ్యత, ట్రేడ్ లైసెన్స్ లపై ఫిర్యాదు చేయాలనుకునే వారు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఫుడ్ సేఫ్టీ విభాగంలో రాతపూర్వకంగా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆహార భద్రత అధికారి మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 32వ డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతా: ధర్ని మధుకర్

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు.. మౌలిక వసతుల కల్పనకు హామీ - భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో ఓటర్లకు విన్నపం**

నస్పూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ధర్ని మధుకర్

32వ డివిజన్ కార్పొరేటర్‌గా ఆదరించి గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధిలో కార్పొరేషన్‌లోనే ప్రథమ స్థానంలో నిలుపుతానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ధర్ని మధుకర్ ప్రకటించారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకుంటూ చేయి గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆశీస్సులతో తాను ఈ ఎన్నికల బరిలో నిలిచినట్లు వెల్లడించారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో ఏరియా ఇన్చార్జిగా వ్యవహరించిన తనకు స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉందని మధుకర్ పేర్కొన్నారు. ప్రేమ్ సాగర్ రావు ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఇప్పటికే మెజారిటీ సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. డిఎంఎఫ్‌టి నిధులను వినియోగించి డివిజన్ వ్యాప్తంగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మూడు కమ్యూనిటీ హాళ్లను నిర్మించినట్లు చెప్పారు. నివాస గృహాల పైనుంచి వెళ్తున్న 11 కెవి విద్యుత్ లైన్లను తొలగించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించినట్లు వివరించారు. సంక్షేమ పథకాల అమలులో డివిజన్‌కు ప్రాధాన్యత ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే 39 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. మిగిలిన అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా ప్రత్యేక కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు, కొత్తగా పెళ్లైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయించామని గుర్తు చేశారు. ఆదిపరాశక్తి దేవాలయం వద్ద 50 లక్షల రూపాయల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని వెల్లడించారు. రాబోయే రోజుల్లో డివిజన్ రూపురేఖలు మారుస్తామని మధుకర్ ధీమా వ్యక్తం చేశారు. ఇరుకైన రోడ్లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించి రహదారులను వెడల్పు చేస్తామన్నారు. స్థానికుల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. డ్వాక్రా భవనానికి మరమ్మత్తులు చేపట్టి అవసరమైన సౌకర్యాలు కల్పించి మహిళలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శబరిమాత ఆలయ వార్షికోత్సవంలో బలరాం జాదవ్

**నేరడిగొండ, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:**

ఇచ్చోడ మండలం కొకస్ మన్నూర్ గ్రామంలో శబరిమాత ఆలయ వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్తుల ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పాదుకలకు మొక్కిన ఆయన, అనంతరం పురవీధుల్లో నిర్వహించిన పల్లకి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ, రామభక్తురాలిగా శబరిమాత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆలయ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించినందుకు కమిటీ సభ్యులను, గ్రామస్తులను ఆయన అభినందించారు.



## ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించాలి

**సిరికొండ, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:**

వేసవి కాలం దృష్ట్యా ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదివాసీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు పెందూర్ మహేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి ప్రారంభం కాకముందే ఆదివాసీ గూడాల్లో నీటి ఎద్దడి మొదలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా లక్కంపూర్, కన్నాపూర్, జాకీర్ గూడ వంటి గ్రామాల్లో ఏటా నీటి సమస్య తీవ్రంగా ఉంటుందని గుర్తు చేశారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు తక్షణమే స్పందించి, ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. రాబోయే ఎండకాలంలో ఆదివాసీలు గుక్కెడు నీటి కోసం ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

## జాకీర్‌గూడలో వైభవంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ బొడ్డు దత్తాత్రి**

**సిరికొండ, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:**



సిరికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని జాకీర్‌గూడ గ్రామంలో లబ్ధిదారులు మోతిరాం సుష్మ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ బొడ్డు దత్తాత్రి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం నూతన గృహప్రవేశం చేసిన దంపతులకు బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తోందని, సొంత స్థలం ఉన్న వారికి ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. సిరికొండ గ్రామంలో మరో 38 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నాయని, త్వరలోనే వాటన్నిటికీ గృహప్రవేశాలు జరిగేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే కాలంలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించి, అర్హులైన నిరుపేదలందరికీ అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ వేడుకలో సర్పంచ్ బండు పటేల్, ఉప సర్పంచ్ తోకల రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఇమామ్, మాజీ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, వార్డు సభ్యులు సందీప్, రామారావు, రాజేష్, ముక్రం, రషీద్, గజానంద్, ముత్యపు రాజేష్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై ఎగిరేది

# ఎర్ర, గులాబీ జెండాలు

**- కాంగ్రెస్ స్కామ్‌లపై బి.ఆర్.ఎస్, సీ.పి.ఐ ఉమ్మడి పోరు - మాజీ మంత్రి బి.ఆర్.ఎస్ ఎల్.పి ఉప నేత హరీష్ రావు**

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పై ఈ దఫా ఎర్ర గులాబీ జెండాలు ఎగురుతాయని, కాంగ్రెస్ స్కామ్‌ల పై బి.ఆర్.ఎస్ పార్టీ,సీ.పి.ఐ పార్టీ లు ఉమ్మడి పోరాటం చేస్తాయని మాజీ మంత్రి బి.ఆర్.ఎస్ ఎల్.పి ఉప నేత హరీష్ రావు అన్నారు.చెన్నూరు నియోజకవర్గం,క్యాతన్ పల్లి మున్సిపాలిటీ రాజీవ్ చౌక్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నూర్ మాజీ ఎం.ఎల్.ఏ బాల్క సుమన్, ఏ.ఐ.టీ.యూ.సి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బి.ఆర్.ఎస్, సీ.పి.ఐ పార్టీల అభ్యర్థులతో కలిసి నిర్వహించిన కార్నర్ సమావేశానికి ముఖ్య అతిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ భవిష్యత్, సింగరేణి భవిష్యత్తు పై ఆధారపడి ఉన్నదని, గతంలో ఏ ప్రభుత్వం కూడా సింగరేణిలో వేలు పెట్టలేదన్నారు. సింగరేణి కోల్ ఇండియాకు ఆదర్శంగా ఉండేదని, దేశం మెచ్చుకునే, ప్రపంచం మెచ్చుకునే స్థాయిలో ఉన్న సిరుల గని సింగరేణిని స్కామ్‌లకు నిలయంగా రేవంత్ రెడ్డి మార్చిండని అన్నారు. బ్యాంకుల్లో అప్పు తెస్తే గాని సింగరేణి జీతాలు ఇవ్వని పరిస్థితికి కాంగ్రెస్ పార్టీ నెట్టిందని అన్నారు. సైట్ విజిట్ పద్ధతి తెచ్చి ఓబీ కాంట్రాక్టుల్లో వేల కోట్ల స్కాం చేశారని ఆరోపించారు. అనుయాయులకు టెండర్లు ఇచ్చి, కమీషన్లు పంచుకున్నారని, సైట్ విజిట్ వచ్చాక మొదటి టెండర్ రేవంతు బామ్మర్ది సృజన్ రెడ్డికి టెండర్ దక్కిందని అన్నారు. మొత్తం ఆరు వేల కోట్ల టెండర్ దక్కించుకుని స్కాం చేశారని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో అయిన టెండర్లు రద్దు చేసి ప్లస్ 20 శాతంకు టెండర్లు ఇచ్చారని, తప్పు చేయకుంటే ఎందుకు విచారణ జరపరని,ఎందుకు సిట్టింగ్ జడ్జితో విచారణ జరుపరని, ఎందుకు సీబీఐ విచారణ జరుపరని అన్నారు. శ్రీరాంపూర్ టెండర్ టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసి, ఫైనాన్స్ టెండర్ 7 సార్లు తేదీలు మార్చారని,లెక్కలు కుదరడం లేదని వాయిదా వేశారని, డీజిల్ స్కాం, జిలిటెన్ స్టిక్స్ స్కాం, నైనీ కోల్ స్కాం, సోలార్ పవర్ స్కాం చేశారని అన్నారు.బంగారు బాతును కోసుకుతింటున్నారని, ఐదు, పదేండ్లలో సింగరేణిని ఖతం చేస్తారని అన్నారు.చంద్రబాబు డిపెండెంట్ ఉద్యోగాలు రద్దు చేస్తే కేసీఆర్ పునరుద్ధరించారనన్నారు. నెల నెలా మెడికల్ బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసి 16,500 మంది



సింగరేణి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చిండన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక మెడికల్ బోర్డు బంద్, డిపెండెంట్ ఉద్యోగాలు బంద్ అయ్యాయాన్ని అన్నారు. నడవలేని వారిని, గుండెకు బై పాస్ సర్జరీ చేసుకున్న వాళ్లను అన్‌ఫిట్ చేయడం లేదని,కార్మిక మంత్రిగా వివేక్ కార్మికులకు అన్యాయం జరిగితే ఎందుకు మాట్లాడడని ప్రశ్నించారు. కార్మిక మంత్రి స్కామ్‌లు జరిగితే నోరు మేధపడం లేదని మంత్రికి ఏమైనా వాటా ఉందా? రేవంత్ అన్యాయంపై ఎందుకు మాట్లాడరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సింగరేణిని ఆగం చేస్తున్నదని అందుకే ఏఐటీయూసీ నాయకులు, సిపిఐ నాయకులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్‌తో గళం కలిపేందుకు ముందుకు వచ్చారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్మికులు ఇచ్చే బోనస్ కూడా బోగస్ చేసిండని, రేవంత్ రెడ్డి నిమ్స్‌కు తప్ప కార్పొరేట్ ఆస్పత్రుల్లో కార్మికులకు వైద్యం అందకుండా చేసిండన్నారు. రెండేళ్లుగా సింగరేణి సీఎండీని కూడా నియమించలేదని, సింగరేణి స్కాం బయట పెడితే, నన్ను విచారణకు పిలిచిండని నోటీసులు పంపిండని ప్రశ్నించే గొంతులను అణిచివేస్తున్నడన్నారు. కేసీఆర్ తెలంగాణ సాధించకుంటే, ముఖ్యమంత్రి అయ్యేవాడు కాదన్నారు. కేసీఆర్ గురించి ఆయన మాట్లాడుతున్న బాషను ఒప్పుకుంటరా? ముఖ్యమంత్రి మాట్లాడే భాషనా? అని ఎద్దేవా చేశారు. పింఛన్ 200 నుంచి 2000 పెంచిండు కేసీఆర్ పెంచిండని,రేవంత్ రెడ్డి 26 నెలలుగా అవ్వాతాతలకు 52 వేలు బాకీ పడ్డడని నెలకు 2500 మహిళలకు ఇస్తానని మాట తప్పిండని, ప్రతి అక్కకు చెల్లకు 65 వేలు బాకీ పడ్డడని, కేసీఆర్ ఆడబిడ్డ పెళ్లికి లక్ష ఇస్తా అంటే ఇచ్చారని రేవంత్ రెడ్డి చెప్పిన తులం బంగారం ఏమైందని, భూముల ధరలు పాతాళానికి, బంగారం ధరలు ఆకాశానికి అంటాయన్నారు. స్కాంల గురించి అడిగితే డైవర్షన్ స్కీంలు అడిగితే డైవర్షన్ బిడ్డ రేవంత్ రెడ్డి నిన్ను కూడా తెలంగాణ ప్రజలు డైవర్షన్ చేస్తారాని అన్నారు. కరోనాలో కూడా కేసీఆర్ రైతుబంధు ఇచ్చిండని, రేవంత్ రెడ్డి రెండు ఇచ్చి మూడు ఎగ్గొట్టిండని ఫిబ్రవరి నెల వచ్చిన రైతుబంధు పడలేదని అన్నారు. కరోనాలో కేసీఆర్ మూడు నెలలు పాటు బియ్యం ఇచ్చిండని, అన్నారు. మంచిర్యాల జిల్లా కలను కె.సి.ఆర్ సాకారం చేసిండన్నారు. మెడికల్ కాలేజీ ఇచ్చిండని చెన్నూరు ను రెవెన్యూ డివిజన్ చేసిండని,ప్రజల కోసం కాకుండా ఆస్తులు పెంచుకునేందుకు రేవంత్ రెడ్డి అధికారం వాడుకుంటున్నడన్నారు. క్యాతన్ పల్లి ఎన్నికల్లో కారు గుర్తుకు, కంకి కొడవలి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. క్యాతన్‌పల్లి కోసం 200 కోట్లు మంజూరు చేశామని, క్యాతన్‌పల్లి ఫ్లైఓవర్ కట్టినమని, బాల్క సుమన్ క్యాతన్ పల్లి ఎంతో అభివృద్ధి చేశాడని రెండేళ్లలో ఒక్క పని అయినా అయ్యిందా? విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, ఆటో కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు అందరూ రేవంత్ పాలనలో బాధలు పడుతున్నరని,కేసులు పెట్టి, బూతులు మాట్లాడి భయపెట్టాలని చూస్తున్నడన్నారుసికాస గడ్డ ఇదని, భయ పెట్టాలని చుక్కలు చూపించిన గడ్డ ఇదని,తెలంగాణ ఉద్యమం చేసినం, సికాస గడ్డ ఇదని రెండేళ్ల తర్వాత వచ్చేది కేసీఆర్ ప్రభుత్వం. అన్ని పనులు పూర్తి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజా రమేష్, పట్టణ అధ్యక్షుడు కంభ గోని సుదర్శన్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

## నృత్య ప్రతిభను చాటిన విద్యార్థులు

**లక్షెట్టిపేట ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

అరుణాచల నృత్యోత్సవంలో లక్షెట్టిపేట, జన్నారం ప్రాంతాలకు చెందిన నటరాజ కళా క్షేత్రం విద్యార్థులు అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అరుణాచలంలోని లంబోదర అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 31న నిర్వహించిన ఉత్సవంలో విద్యార్థులు తమ నృత్య ప్రతిభను చాటారు. గురువు గాజుల నర్మదా మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులు సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల నైపుణ్యం, భావప్రకటన, లయాత్మక ప్రదర్శనలు నృత్యోత్సవానికి మరింత శోభను చేకూర్చాయి. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. నటరాజ కళాక్షేత్రం అందిస్తున్న సేవలను, గురువు నర్మదా శిక్షణను తల్లిదండ్రులు, కళాప్రియులు కొనియాడారు. భవిష్యత్తులో విద్యార్థులు కళారంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.



## కాంగ్రెస్ అభ్యర్థుల విజయంతో క్యాతన్‌పల్లి అభివృద్ధి: డీసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**



ఈ నెల 11న జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయం సాధిస్తే క్యాతన్‌పల్లి అభివృద్ధి చెందుతుందని మంచిర్యాల జిల్లా డి.సి.సి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన పలు వార్డులలో ప్రచారం నిర్వహించి, 17వ వార్డు అభ్యర్థి లావణ్య శ్రీనివాస్, 18వ వార్డు అభ్యర్థి పల్లె శ్రీదేవిరాజులతో కలిసి కార్నర్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీకి పట్టణ ఓటర్లు మద్దతు తెలియజేయాలని కోరారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ఇప్పటికే కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని అన్నారు. క్యాతన్ పల్లి సమగ్ర అభి వృద్ధి చెందాలంటే చేతి గుర్తు పై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

### బెల్లంపల్లి ఫుడ్ పాయిజన్ ఘటనపై

# ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సీరియస్

**బెల్లంపల్లి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ - బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థినులకు చికిత్స**





**బెల్లంపల్లి, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ కేంద్రంలో గల గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకొని శనివారం హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వ అస్పత్రికి వెళ్లి విద్యార్థినులను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పరామర్శించారు. బాధిత విద్యార్థినులతో మాట్లాడి ఫుడ్ పాయిజన్ ఘటనపై ఆరా తీశారు. విద్యార్థినుల క్షేమ సమాచారం తెలుసుకొని వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్, డాక్టర్స్ ఆసుపత్రి సిబ్బందిని ఎమ్మెల్సీ కొమరయ్య ఆదేశించారు. ఫుడ్ పాయిజన్ జిల్లా సబ్ కలెక్టర్ ఐఈఎస్ఎస్డి మనోజ్‌తో ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతిసారి గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఎందుకు జరుగుతోంది..? అధికారుల పర్యవేక్షణ ఎందుకు కొర్వడుతోంది అని పై విషయాలపై పూర్తి స్థాయి విచారణ చేసి సమగ్ర రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం అధికారులను ఆదేశించారు. ఈ ఘటనకు బాధ్యులు ఎవరో నిగ్గు తేల్చాలి, మళ్ళీ ఇలాంటివి జరగకుండా చూడాలని అన్నారు. ఫుడ్ పాయిజన్ ఎందుకు జరిగింది, విద్యార్థిలు ఇలాంటి ఫుడ్ తీసుకోవడం వాళ్ళ అశ్వస్థ కు గురయ్యారు. ఇలాంటివి జరగకుండా ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రిపోర్ట్ హెల్త్ డైరెక్టర్‌కు పంపాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగడం బాధాకరమని, ఇది పూర్తిగా గురుకులాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని, పిల్లల ప్రాణాలంటే మీకు లెక్కలేదా? ఎన్ని సార్లు ఇలాగే రిపీట్ అవుతాయని అన్నారు. గురుకులాలపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఈ ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను, ఆసుపత్రి అధికారులను, సిబ్బందికి ఆదేశించారు.



## ప్రజా సేవ చేయాలని సంకల్పం రాజకీయాలతో సాధ్యం

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

ప్రజా సేవ చేయాలనే సంకల్పం, తపన, ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనే సంకల్పం వస్తున్న తనను ఆదరించాలని, బీఆర్ఎస్ 17వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి డాక్టర్ సంధ్యారాణి రాజా రమేష్ అన్నారు. శనివారతతం 17వ వార్డులో ఆమె ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ తనకు కౌన్సిలర్‌గా పోటీ చేసే అవకాశం కల్పించందని, కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వార్డులో డ్రైనేజీ, రోడ్లతో పాటు అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందని కాంగ్రెస్ పరిపాలన పై ప్రజలు పూర్తి స్థాయిలో అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా..

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో ఒకటో వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తానని స్వతంత్ర అభ్యర్థి పల్లపు గంగరాజు ఓటు అభ్యర్థించారు. వార్డ్‌లో ఇంటింటికీ తిరిగి ఓటర్లను వేడుకున్నారు. ఊహ తెలిసినప్పటి నుండి రాజాకీయాలలో ఉంటున్నానని, కౌన్సిలర్‌గా ఒకటో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, తనకు కేటాయించిన బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## నగదు స్వాధీనం చేసుకున్న ఎన్నికల అధికారి

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు లక్షెట్టిపేట ఎఫ్ఎస్‌టి అధికారి తాసిల్దార్ దిలీప్ కుమార్ తెలిపారు. లక్షెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో ఎన్నికల నిబంధనలు విరుద్ధంగా దొడ్డ రాజన్న అనే వ్యక్తి 1,08,000 రూపాయలు తీసుకొని వెళుతుండగా చెక్‌పోస్ట్ వద్ద దగ్గర నుంచి నగదును స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం కలెక్టర్ కార్యాలయంలోని ట్రెజరీ కౌంటర్లో అందజేయడం జరిగింది. ఇట్టి నగదుకు బాధితుడు సరైన పత్రాలు ట్రెజరీ కార్యాలయంలో అప్పగించి అక్కడి అధికారుల సూచన మేరకు తిరిగి పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు.



## క్షయ నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**జన్నారం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

క్షయ నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది అని జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ లక్ష్మిలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి టీబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ ఆదేశాల ప్రకారం జన్నారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 88 మందికి ఎక్స్‌రే పరీక్షలు, పదిమందికి తెమడ పరీక్షలు, 50 మందికి హెచ్ఐవి పరీక్షలు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం గ్రామ సర్పంచ్ కళావతి, వార్డు సభ్యులు బి సురేష్, ఎస్ టి ఎస్ ప్రవీణ్, ఎక్స్ రే టెక్నీషియన్ పోచయ్య, హెల్త్ అసిస్టెంట్ రషీద్ ఖాన్, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి

**హాజీపూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

మంచిర్యాల కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు త్వరితగతిన అందుతాయని అన్నారు. ప్రజాసంక్షేమ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. శనివారం 16, 17,18 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులు బియ్యాల త్రివేణి, లగిశెట్టి రాజయ్య, శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.



## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: డిసిపి భాస్కర్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**



మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల డి.సి.పి భాస్కర్ హెచ్చరించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని సింగరేణి క్లబ్‌లో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను శనివారం ఆయన బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని,ప్రతి ఓటరు ఎలాంటి భయం,ఒత్తిడి లేదా ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ రమేష్, రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచ్

**వేమనపల్లి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీ పరిధిలో శనివారం గ్రామ సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పలు వార్డులలో ఉన్న రోడ్లపై పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే కల్మలపేటలో అంగన్వాడి కేంద్రాన్నీ పరిశీలించి పిల్లలకు అన్నప్రాసనం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, అంగన్వాడీ టీచర్స్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి... అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

### - 6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తోట సువర్ణ రమేష్

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**



మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించి అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని లక్షెట్టిపేట 6వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి తోట సువర్ణ రమేష్ కోరారు. శుక్రవారం రోజున ఆయన 6వ వార్డులో కార్యకర్తలతో పాటు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధితో పాటు మన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పట్టణంలో చేసిన అభివృద్ధిని ఓటర్లకు తెలుపుతూ ప్రచారం నిర్వహించారు. తనపై నమ్మకంతో వార్డు అభివృద్ధికి ఎమ్మెల్యే వార్డు కౌన్సిలర్‌గా అవకాశం ఇచ్చారని ఈనెల 11వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు. గెలిచిన వెంటనే వార్డులోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

## ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ, అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో సిఆర్పిలు, కృషి సఖీ లకు ఏర్పాటు చేసిన 5 రోజుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధమైన వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించాలని, ప్రకృతి సేద్యం చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కలుషితమైన పంటలు పండించడం, వాటిని ఆహార రూపంలో తీసుకోవడం ద్వారా మనిషి ఆరోగ్యం క్షీ ణించి రోగాల బారిన పడుతున్నారని, అధిక మోతాదులో యూరియా, డిఏపిల వాడకాన్ని నియంత్రించుకోవాలని, పశువుల పేడ, ఇతర సేంద్రియ ఎరువులను వినియోగించి పంట సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, సహాయ సంచాలకులు మనోహర్, మిలింద్ కుమార్, వ్యవసాయ, విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 33వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా: ఎంబడి కుమారస్వామి

### - ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు సహకారంతో ప్రగతి పథంలోకి డివిజన్

**నస్పూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

33వ డివిజన్ కార్పొరేటర్‌గా ఆశీర్వదించి గెలిపిస్తే స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సహకారంతో డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి ఎంబడి కుమారస్వామి అన్నారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్‌లో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చేయి గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంచిర్యాల నియోజకవర్గ ముఖచిత్రం మారిందని కుమారస్వామి పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమంలో నియోజకవర్గం ముందంజలో ఉందని వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా హిత కార్యక్రమాలు ప్రజల చెంతకు చేరుతున్నాయని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి డివిజన్ ప్రగతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా డివిజన్ వ్యాప్తంగా పర్యటించిన అభ్యర్థికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే కాంగ్రెస్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అండదండలతో డివిజన్‌లోని మౌలిక వసతులను మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎంబడి కుమారస్వామి

# విద్యార్థినిల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**



సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల షెడ్యూల్డ్ కులాల సమీకృత బాలికల వసతి గృహంలో అస్వస్థతకు గురై మండల కేంద్రంలోని ప్రభుత్వ కెమికల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం వసతి గృహ భవనాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా షెడ్యూలు కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్‌లతో కలిసి సందర్శించి వసతి గృహ వార్డులు, వంటశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తుందని తెలిపారు. శుక్రవారం రాత్రి భోజనం అనంతరం 16 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించడం జరిగిందని, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థినులు పూర్తిగా కోలుకున్నారని, శనివారం సాయంత్రం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేస్తారని తెలిపారు. ఈ చర్య పై వసతి గృహ సంక్షేమ అధికారి సుజాతకు షోకాజ్ నోటీస్ జారీ చేయడం జరిగిందని, వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు పరిశీలన

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 07 ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఉన్న ఈవీఎం భద్రత కేంద్రాన్ని (గోదాము) జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం సందర్శించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం ప్రతి నెలా నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన ఈ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోదాములోని ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల భద్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాము లోపల మరియు వెలుపల అమర్చిన సీసీ కెమెరాల పనితీరును, రిజిస్టర్లలో నమోదైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గోదాము పరిసరాల్లో నిరంతరం నిఘా ఉండాలని, అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు పంచాపూల, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి యూరియా ఆన్లైన్ చేసుకోండి

**కెరమెరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

ఆదివారం 8వ తేదీ నుండి యూరియా కొనుగోలు చేయవలసిన రైతులు, వ్యవసాయ కమిషనరేట్ వారు ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ యూరియా బుకింగ్ యాప్ ధ్వారా మాత్రమే కొనుగోలు చేయవలసివుంటుంది ఆన్‌లైన్ యూరియా బుకింగ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి సంబందించి సందేహాలను డీలర్‌లను లేదా సంబంధిత వ్యవసాయ విస్తనాధికారులను( ఏఈఓ) లేదా మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని ఏఈఓ యుగంధర్ తెలిపారు.

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

జిల్లాలోని రైతుల కోసం ఈనెల 8 నుండి జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం యాప్ ద్వారా యూరియా బుకింగ్ తీసుకోవడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి శనివారం ప్రకటనలో తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి మండలాలలో, జిల్లాలో ఎక్కడైనా యూరియా కొనుగోలు చేసుకోవచ్చని, ఎలాంటి సమయం వృధా లేకుండా వరుసలో నిలబడి వేచి ఉండకుండా రైతులు తమ ఇంటి వద్ద నుండే బుక్ చేసుకుని 24 గంటలలో తాము బుక్ చేసుకున్న ఎరువుల దుకాణానికి వెళ్లి కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా రైతులు యూరియా బుకింగ్ యాప్ ను వినియోగించుకుని వ్యవసాయ అధికారుల సహకారంతో యూరియా కొనుగోలు చేసుకోవాలని తెలిపారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

### - ఈ నెల ౯ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 07 ప్రభాతవార్త:**

జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. 2026-28 సంవత్సరాలకు గాను అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనుందని, ఈ నేపథ్యంలో నూతన కార్డుల జారీ కోసం సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చిందని కలెక్టర్ వివరించారు. మీడియా యాజమాన్యాలు తమ ప్రతినిధుల జాబితాను ముందుగా జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి పంపాలి. జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 9వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**తాండూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

12న నిర్వహించి తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారం కోరారు. మండలంలోని ఐబిలో సిఐటియు ఆధ్వర్యంలో శనివారం పాంప్లెట్స్. బుక్ లెట్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మరణ శాసనంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ లను రద్దు, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగం, వ్యవసాయ కార్మికుల వ్యతిరేక విధానాలకు, నరేంద్ర మోడీ ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.కార్యక్రమంలో లీలారాణి, రెడ్డి మల్లక్క, హనుమక్క, రైసా, సరిత, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, దుర్గం నాన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



దేశవ్యాప్త సమ్మె కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి వంటశాల, తరగతి గదులు, హాజరు పట్టికలు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, భోజనశాల, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, ఉత్తమ ఫలితాల సాధన దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె. హరిత

పౌష్టిక ఆహారంతో పాటు శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి కూలీలకు కల్పిస్తున్న పని దినాల రిజిస్టరు పరిశీలించి, పని దినాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు అర్హత ప్రకారం పని దినాలు కల్పించాలని తెలిపారు. మండలంలోని లక్ష్మీపూర్, పులికుంట, కొండపల్లి గ్రామపంచాయతుల్లో పర్యటించి నర్సరీలు, పాఠశాలలు పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని సూచించారు. అదేవిధంగా తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. భూ భారతి రికార్డులు, వివిధ ధ్రువపత్రాలు, కళ్యాణ లక్ష్మి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, వివిధ పనుల కొరకు కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాలలో తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్ జ్యోత్నకు వినతిపత్రం ఇస్తున్న బారేపల్లి గ్రామస్తులు

## వ్యవసాయ బోర్లను నియంత్రించాలని వినతి

**తాండూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

మండలంలోని రేచిని గ్రామపంచాయతీ పరిధిలోని బారేపల్లి గ్రామంలో కొందరు వేస్తున్న వ్యవసాయ బోర్లు ను నియంత్రించాలని గ్రామస్తులు కోరారు. తాండూర్ తహసిల్దార్ జోత్స్నకి శనివారం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వ్యవసాయానికి సరిపడా నీరు అందకపోవడంతో మా గ్రామానికి 200 మీటర్ల దూరంలో ఒక గుంట భూమిని కొనుగోలు చేసి అందులో అధిక సంఖ్యలో బోర్లు వేసి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయం భూమికి బోరు వేసే ప్రయత్నాలను గ్రామస్తులందరూ అడ్డుకోవడం జరిగిందన్నారు. వ్యవసాయ బోరు వేయడం వలన రానున్న రోజుల్లో త్రాగునీటి సమస్య ఏర్పడుతుందని అధికారులు స్పందించి మా గ్రామానికి దగ్గరలో వ్యవసాయ బోర్లు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయానికి సంబంధించి బోర్లు రెండు కిలోమీటర్ల దూరంలో అనుమతులు ఇవ్వాలని కోరారు. తహసిల్దార్ స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

## ఘనంగా రమాబాయి జయంతి వేడుకలు

**కెరమెరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ గారి 128వ జయంతి వేడుకలను శనివారం కెరమెరి మండల కేంద్రంలో అంబేద్కర్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు రమబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రమాబాయి గొప్ప త్యాగమూర్తి అని కొనియాడారు. భర్త అంబేద్కర్ ఉన్నత విద్యకు ఎంతో ఆసరాగా నిలిచిందన్నారు. అంబేద్కర్ దంపతులు దళిత సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుమ్మగూడ సర్పంచ్ కుంరం భీంరావు, అంబేద్కర్ మెమోరియల్ అధ్యక్షుడు గాయక్వాడ్ శివాజీ, నాయకులు రఘునాథ్, తాలీమ్ ఖాన్, ఫయ్యాజ్, ముజ్జు, భరత్, కాంబ్లె దత్తు తదితరులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో అంబేద్కర్ మెమోరియల్ సభ్యులు

**లింగాపూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

లింగాపూర్ మండల కేంద్రంలోని కరుణ బౌద్ధ విహారలో శనివారం భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి సతమణి,మాత రమాబాయి అంబేద్కర్ గారి 128 వ జయంతిని మాత రమాబాయి మహిళా మండలి, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూత్ అసోసియేషన్, సభ్యుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు . డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ ప్రపంచ స్థాయిలో ఎదగడానికి మాత రామ అంబేద్కర్ గారి యొక్క త్యాగాలు, వరణాన్ని తీరం భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సంసార సాగరంలో రమాబాయి పాత్ర ఎంతో ముఖ్యమైనందని గుర్తు చేశారు, రమాబాయి త్యాగాల ఫలితంగానే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చదువుకు ఉద్యోగంలో రాజకీయంలో భారత రాజ్యాంగం రచించడంలో అని విధాలుగా సహాయ సహకారం అందించడంతో అంబేద్కర్ ప్రపంచస్థాయి గుర్తింపు పొందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రమాబాయి మహిళా మండలి సభ్యులు, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సభ్యులు, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు, మండల స్థాయి నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రిడిటేషన్ కార్డుల కొరకు దరఖాస్తుల స్వీకరణ

**- మంచిర్యాల జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు అర్హులైన జర్నలిస్టుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో అక్రిడిటేషన్ మాడ్యూల్ వెబ్ సైట్ ప్రారంభించడం జరిగిందని, 2026-28 సంవత్సరానికి గాను అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనుందని, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. మీడియా యాజమాన్యాలు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కొరకు తమ ప్రతినిధుల పేర్లను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి పంపించాలని, అట్టి జాబితాలో ఉన్న అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ నుండి https://ipr.telangana.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

మండలంలోని ఎల్లూర్ గ్రామ పంచాయతీలో నేడు వీధి దీపాల అమరిక పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అంజల్ కుమార్శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల నేపథ్యంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్కపల్లి, ఎల్లూర్ ఫీడర్ల పరిధిలోని విధ్యుత్ వినియోగదారులు ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకొని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



క్రిటికల్ కేర్ ఆస్పత్రి పనులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె. హరిత

## క్రిటికల్ కేర్ ఆసుపత్రిని ప్రారంభానికి సిద్ధం చేయాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన క్రిటికల్ కేర్ ఆస్పత్రి పనులు పూర్తి అయినందున ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో నిర్మించిన క్రిటికల్ కేర్ ఆసుపత్రిని వైద్య శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రిటికల్ కేర్ ఆసుపత్రి పనులు పూర్తి అయినందున త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలోని పలు విభాగాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటించాలి

**- ఏవో రామకృష్ణ**

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

మండలంలోని రైతులు తప్పనిసరిగా ఫెర్టిలైజర్ యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యాప్ లో బుకింగ్ చేసుకున్న రైతులకు తప్పకుండా ఎరువులు అందించాలని డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రతి డీలర్ ఫెర్టిలైజర్ యాప్ పై పూర్తి అవగహన కలిగి ఉండాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు.



# మందమర్రి టోల్ గేట్ వద్ద ఉద్యోగుల ఆందోళన

● మూడు నెలల జీతాలు బకాయి ● యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మందమర్రి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సోమగూడెం సమీపంలోని టోల్ ప్లాజాలో పనిచేస్తున్న ఉద్యోగులు శనివారం ఆందోళన చేపట్టారు. గత మూడు నెలలుగా జీతాలు చెల్లించకుండా యాజమాన్యం తీవ్ర అన్యాయం చేస్తోందని, వెంటనే బకాయి వేతనాలు చెల్లించి విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటన జారీ చేయడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో పని చేయించుకుని జీతాలు ఇవ్వకుండా తప్పించుకోవడమే కాకుండా, బయట వ్యక్తులతో టోల్ గేట్ పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇది కార్మిక చట్టాలకు విరుద్ధమని, తమ కుటుంబాల జీవనాధారం దెబ్బతింటోందని తెలిపారు. యాజమాన్యం తమ సమస్యలను పట్టించుకోకపోవడంతో నిరసనగా టోల్ గేట్ కార్యకలాపాలను, వాటర్ ట్యాంకర్లను అడ్డుకున్నట్లు చెప్పారు. బకాయి వేతనాలు పూర్తిగా చెల్లించి, తొలగింపు ప్రకటనను రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంపై కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు కోరారు.



టోల్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

## వైద్య ఖర్చుల కోసం 86 వేల రూపాయల ఆర్థిక సహాయం

జన్నారం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

జన్నారం మండలం రోటి గూడెం గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు ఉప్పు గంగన్న పెద్ద కుమారుడు ఉప్పు అనిల్ వైద్య ఖర్చుల కోసం గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 86 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. జనవరి 22వ తేదీ గురువారం సాయంత్రం జరిగిన బైక్ యాక్సిడెంట్‌లో ఉప్పు అనిల్ తలకు తీవ్ర గాయం కావడంతో కరీంనగర్ లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో తలకు ఆపరేషన్ చేసి చికిత్స అందించారు. ఈ చికిత్సకు వైద్య ఖర్చులు ఎక్కువ మొత్తంలో కావడంతో రోటి కూడా గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సభ్యులు మానవత్వంతో స్పందించి మన కార్మిక కుటుంబానికి భరోసానివ్వాలని నిర్ణయించుకుని అలాగే కమిటీలో నిర్ణయించి 86,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రోటి గూడ గల్ఫ్ కమిటీ అధ్యక్షులు ఉప్పు తిరుపతి, వ్యవస్థాపకులు సేపూరి గోపాల్, జాల పెల్లి మల్లారెడ్డి, శివ నూరి శ్రీనివాస్, ఉప్పు నరేష్, ఉప్పు సతీష్, ఉప్పు సురేష్, ఒడ్డేటి రమేష్, బోదాసు మల్లేష్, కుంట నాగేష్, పురం శెట్టి గోపాల్, ముత్యాల రాజేందర్ పాల్గొన్నారు.



## అట్టహాసంగా నియోజకవర్గ స్థాయి సిఎం కప్ ఆటల పోటీలు

- మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు



మంచిర్యాల,ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

సిఎం కప్ 2025లో భాగంగా నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు అటహాసంగా నిర్వహించడం జరిగిందని మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా యువజన క్రీడా సేవల శాఖ అధికారి గుర్రాల హనుమంతరెడ్డి, అధికారులు, క్రీడాకారులతో కలిసి పోటీల నిర్వహణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజస్వ మండల అధికారి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రభుత్వం సిఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. గ్రామీణ, మండల స్థాయి పోటీలను పూర్తిచేసుకుని నియోజకవర్గస్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 13వ తేదీన జరగనున్న జిల్లాస్థాయి ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు మంచిర్యాల నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి దాదాపు 800 మంది క్రీడాకారులు హాజరయ్యారని, వాలీబాల్, కబడ్డీ , ఖోఖో, ఫుట్ బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా, ఇతర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మండల విద్యాధికారి మాళవిదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రమేశ్, దండేపల్లి మండల విద్యాధికారి మంత్రి రాజు, మంచిర్యాల జిల్లా ఎస్జిఎఫ్ సెక్రెటరీ ఎండి. యాకూబ్, ఖేలో ఇండియా బాక్సింగ్ రాజేష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్, వ్యాయమ విద్య ఉపాధ్యాయ సంఘం నాయకులు రేణి రాజయ్య, కె. రామ్మోహన్ రావు, సూర సుదర్శన్, సిరంగి గోపాల్, బెల్లం శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఆర్. శ్రీనివాస్ రెడ్డి, విఠల్, సంతోష్, విజయ్ నందం శ్రీనివాస్, కె.జ్యోతి, సాగర్, రోజి వరకుమారి, ఏ.వరలక్ష్మి, గుమాస వరలక్ష్మి, సాగర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## 9 నుంచి సిఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు

- జిల్లా యువజన క్రీడా సేవల అధికారి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:

సిఎం కప్ 2025 పోటీలలో భాగంగా ఈ నెల 9వ తేదీలలో జిల్లాలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడా సేవల అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత సిఎం కప్ 2025 పోటీలలో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి పోటీలను పూర్తి చేసుకుని జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని, మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు, ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులు ఆయా క్రీడా పోటీల వేదికల ఇంచార్జ్ లను సంప్రదించాలని తెలిపారు. క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, ఆన్ లైన్ లో చేసిన జనన ధ్రువీకరణ పత్రం దరఖాస్తు ప్రతితో సకాలంలో హాజరుకావాలని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

## పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పలు భవన నిర్మాణాలపై పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ఈడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024 సంవత్సరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం క్రింద జిల్లాలోని అన్ని యాజమాన్యాల 720 పాఠశాలలలో మౌలిక వసతులకు చేపట్టిన పనుల వాటికి ఎంబిలు సమర్పించాలని, ఇంకా పూర్తి చేయని పనులను ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద యూడైస్ లో వివరాల ప్రకారం బాలికలకు ప్రత్యేక మూత్రశాలల నిర్మాణాలు మార్చి నెలలోగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామ సమాఖ్య, మండల సమాఖ్య భవనాల పనులను చేపట్టి స్థానిక సర్పంచ్ ల భాగస్వామ్యంతో పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి బిల్లులు చెల్లించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ముఖ్య ప్రణాళిక అధికారి వాసుదేవరెడ్డి, పంచాయితీ రాజ్ ఈఈ ధర్మేందర్, సెర్ప్ ఎపిఎం లు, ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

- మండల వ్యవసాయాధికారి రామకృష్ణ

- వరి, మొక్కజొన్న పంటల పరిశీలన

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :

రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాంటించి పంటల సాగు చేయాలని కాగజ్‌నగర్ మండల వ్యవసాయాధికారి జి. రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని జంబుగ, నాగంపేట గ్రామాలలో ఏఓ పర్యటించారు. వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు చేశారు. వరి పంటలో ప్రస్తుత పరిస్థితులలో అగ్గితెగులు సోకే అవకాశం ఉందని ఈ లక్షణాలు గమనించినట్లయితే నివారణకు 0.6గ్రా॥ ట్రైసైక్లోజోల్ (లేదా) 2.5 మి.లీ కానుగమైసిన్ లేదో ట్రైసైక్లోజోల్ + మాంకోజెన్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వరికాండం తొలుచు పురుగు ఉన్నట్లు గమనించినట్లయితే నినారణకు 4 కిలోలు క్లోరాంట్రానిలి ప్రోల్ 0.4 గుళికలు ఒక ఎకరానికి ఇసుకలో కలుపుకొని బురద పదునులో/తక్కువ నీరు పెట్టి చల్లుకోవాలని సూచించారు. మొక్కజొన్న కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు 0.4 గ్రా, ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.3 మి.లీ క్లోరాంట్రానిలిప్రోల్ లీటరు నీటికి కలిపి మొక్క అంత తడిచేల పిచికారి చేయాలని తెలిపారు. అదే విధంగా రైతులు ఈ యాసంగి సీజన్‌లో ఏ పంటలు సాగుచేశారో వాటి వివరాలను ఏఈఓల వద్ద పంటనమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు చేసుకోవడం వలన పంటలను అమ్మే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సాగు విషయంల ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువుల పైన దృష్టి సారించాలని అన్నారు. పంట నూర్పిడి చేస్తే మంచి ఫలితాల ఉంటమని అన్నారు. ఈ కార్యక్రమం ఏఈఓ దుర్గాభవానీ, రైతులు పాల్గొన్నారు.

